క్లుప్తంగా

బాస్కెల్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో డీన్ ఆశోక్‌కుమార్

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్టు వద్ద ఉన్న ఆర్‌జీఎం, శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు రాయలసీమ జోన్-4 బాస్కెల్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు డీన్ ఆశోక్‌కుమార్ తెలిపారు. గురువారం కళాశాలలో ఎంపిక పోటీలు నిర్వహించగా రెండు కళాశాల నుంచి విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. వీరు ఈనెల 17, 18 తేదీల్లో తిరుపతిలో జరిగే జోన్-4 క్రీడల్లో పాల్గొంటారన్నారు. అనంతరం క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, పీడీ వెంకటేష్, నాయక్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్లను సక్రమంగా వినియోగించుకోవాలి



క్లస్టర్ హెచ్‌ఎంలకు కంప్యూటర్లను పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

కల్లూరు: ఆన్‌లైన్ సేవలు సమర్థవంతంగా అందించేందుకు కంప్యూటర్లను సక్రమంగా వినియోగించుకోవాలని ఎంఈఓలు శ్రీనివాసులు, వనజ కుమారి అన్నారు. గురువారం మండలంలోని తొమ్మిది క్లస్టర్ పాఠశాలలకు కంప్యూటర్‌లను ఎంఈఓలు క్లస్టర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఎంఈఓలు మాట్లాడుతూ క్లస్టర్ పరిధిలోని పాఠశాలల వివరాలను, రిపోర్టులు, సమాచారం, విద్యార్థుల నమోదు వివరాలను కంప్యూటర్లలో నమోదు చేయాలన్నారు.

రేపు శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కర్నూలు కల్చరల్: భరత మాత మాతృ మండలి ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు, విద్యార్థులకు నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు మండలి అధ్యక్షురాలు పద్మావతి పేర్కొన్నారు. గురువారం మండలి కార్యాలయంలో వేడుకలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 16వ తేదీ సాయంత్రం 4 గంటలకు వీఆర్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో వేడుకలు జరుగుతాయన్నారు. విద్యార్థులకు నృత్య పోటీలు, బాలగోకులం, చిన్నికృష్ణులు, గోపికల వేషధారణ పోటీలు ఉంటాయన్నారు. గోపూజ, ఉట్లోత్సవం, వక్తలచే సందేశం ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు శుక్రవారం సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల్లోగా ఆలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 94925 50433, 99665 15684 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. మండలి సభ్యులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించండి

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల రైతులు సమస్యలపై ఇచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ పురుషోత్తం, రెవెన్యూ, సర్వే అధికారులు, వీఆర్వోలతో పీజీఆర్ఎస్ అర్జీలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రైతులు ఇచ్చిన అర్జీలను గ్రామాల వారీగా సమీక్షించారు. అర్జీలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలన్నారు. మండల సర్వేయర్ నాగభూషణం, ఆర్ఐ తరుణ్, వీఆర్వోలు, సర్వే సహాయకులు ఉన్నారు.

డాగ్ షెల్టర్‌కు స్థల పరిశీలన



బస్తిపాడు సమీపంలో స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం డాగ్ షెల్టర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ వెల్లడించారు. గురువారం కల్లూరు మండలం బస్తిపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని స్థలాలను కమిషనర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. జననివాస ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద ఉండరాదనే సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా డాగ్ షెల్టర్ ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మనోహర్ రెడ్డి, డీఈఈ గిరిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష కుసుమార్చన

కర్నూలు కల్చరల్: శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని స్థానిక సప్తగిరి నగర్‌లోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో చౌడేశ్వరీ దేవికి లక్ష కుసుమార్చన, సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

స్వాతంత్ర్య యోధులు..
కందనవోలు ముద్దుబిడ్డలు

- బ్రిటీష్ వారితో తలపడిన వీరులు
- ఎందరో జైలుకెళ్లిన వైనం
- పేదల విద్యాభివృద్ధికి పలువురి కృషి
- నేడు 79వ స్వాతంత్ర్య దినోత్సవం

స్ఫూర్తి నింపిన గాంధీజీ మాటలు



స్వాతంత్ర్యోద్యమ కాలంలో జాతిపిత గాంధీజీ ప్రసంగం ఆదోని ప్రజల్లో స్ఫూర్తి నింపింది. 1926లో బ్రిటీష్ ప్రభుత్వం ఉప్పుపై పన్ను విధించింది. ఇందుకు నిరసనగా గాంధీజీ పాదయాత్ర చేపట్టి దేశ ప్రజలందరినీ ఒక్క తాటిపైకి తెచ్చేందుకు యత్నించారు. ఇందులో భాగంగా 1930 సెప్టెంబర్ 30న కర్ణాటకలోని సందూరులో జరిగిన బహిరంగ సభలో పాల్గొని అనంతరం రైలులో ఆదోనికి చేరుకున్నారు. స్థానిక మున్సిపల్ మైదానంలో జరిగిన బహిరంగ సభలో జాతిపిత ఉద్వేగంగా హిందీలో ప్రసంగించారు. పట్టణానికి చెందిన చున్నీలాల్ జయచంద్ సోనో ఆయన ప్రసంగాన్ని తెలుగులో అనువదించారు. ఈ ప్రసంగం స్థానిక ప్రజల్లో స్వాతంత్ర్య సమర స్ఫూర్తిని నింపింది.

కర్నూలు కల్చరల్: జిల్లాకు చెందిన పలువురు యోధులు స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటీష్ వారి నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేశారు. వారి సంకెళ్ల నుంచి భారతావనికి విముక్తి కలిగించేందుకు పోరాడారు. తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టారు. మరికొందరు గాంధీజీ పిలుపునందుకుని స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని చెరసాల పాలయ్యారు. వారి త్యాగాల ఫలితంగానే మనం స్వేచ్ఛావాయువులను అనుభవిస్తున్నాం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు అవుతున్న సందర్భంగా సమరయోధుల త్యాగాలను స్మరించుకుందాం.

స్వాతంత్ర్య సంగ్రామంలో స్ఫూర్తి ప్రదాతలు


ఉమ్మడి జిల్లాకు చెందిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, కర్నూలు నవాబ్ రసూల్ అలీఖాన్, ముత్తుకూరు గౌడప్ప, రెడ్డెక్కమ్మ, మొహియుద్దీన్ ఖాద్రి బియాబానీ, నిడవర్తి వెంకటసుబ్బయ్య, ఖాదర్‌బాద్ నర్సింగరావు, గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, వనం శంకర శర్మ, నివర్తి వెంకట సుబ్బయ్య, టి.చిదంబరం, ఆర్‌కే రామ్, గామాగో, చిదంబరం, మేడం వెంకయ్య శెట్టి లాంటి అనేక మంది సాతంత్ర్య పోరాటాలకు నాయకత్వం వహించి ప్రజలను ఏకం చేశారు. గాడిచెర్ల విజయభేరి, ప్రేమ, తుంగభద్ర, దక్కన్ వైశ్య, మాణిక్య ప్రభు, ఉపాధ్యాయ, భద్రవాణి లాంటి పత్రికలు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వెలువడుతూ ప్రజలను చైతన్య వంతులను చేశాయి. శంకర నారాయణ భజన మందిరం, హిందూ మహమ్మదీయ సంఘం, యూనియన్ క్లబ్ దేశాభిమాని సభ లాంటి సంస్థలు ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్ష పెరగడానికి ఉద్యమం వైపు అడుగులు వేయడానికి ఎంతగానో కృషి చేశాయి.

ఖద్దరు నిధికి విరాళాలు

1929 మే నెలలో గాంధీజీ ఆలిండియా ఖద్దరు యాత్రలో భాగంగా జిల్లాలోని చాగలమర్రి, నల్లగట్ల, శిరువెళ్ల, ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, నంద్యాల, అయ్యలూరు, పాణ్యం, కర్నూలు, నాగలాపురం, ప్యాలకుర్తి, కోడుమూరు, దేవనకొండ, పత్తికొండ, ఆదోనిలో ఖద్దరు నిధికి చందాలు వసూలు చేశారు.



సర్దార్ నాగప్ప



గులాం రసూల్ ఖాన్



మేడం వెంకయ్య శెట్టి



సర్దార్ అమరావతమ్మ


ఆలూరుకు ప్రత్యేక గుర్తింపు

తెల్లదొరలపై తిరగబడి స్వాతంత్ర్య పోరాటంలో చెరగని ముద్ర వేసుకున్నారు ఆలూరు నియోజకవర్గంలోని వీరులు. ఇక్కడి నుంచి సంజీవరెడ్డి, గోవిందదాసు, అక్బర్ అలీ, పుల్లా అయ్యపరెడ్డి, హెచ్.బసవన్నగౌడ్, బొగ్గుల బాలయ్య, నరసింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, హనుమప్ప నాయక్, పాపయ్య చౌదరి లాంటివారు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. తెల్లదొరలను ఎదిరించి జైలు జీవితం గడిపారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని ఆంగ్లేయులను ఎదిరించడంతో వీరిని అరెస్ట్ చేసి బళ్లారిలోని హళ్లీపూర్ జైలులో ఉంచారు. తర్వాతి కాలంలో వీరికి గుర్తుగా ఆలూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద స్తూపం ఏర్పాటు చేశారు. డి.గోవిందదాసు నియోజకవర్గ శాసన సభ్యులుగా సైతం సేవలు అందించారు.

ఆదర్శ వనిత పద్మావతమ్మ

స్వాతంత్ర్య ఉద్యమంలో ఆస్తిని విరాళంగా ఇవ్వడ మే కాకుండా పోరాటం జరిపిన మహిళగా పద్మావతమ్మ నిలిచారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ పిలుపు మేరకు బ్రిటీష్ ప్రభుత్వంలో పోలీస్‌గా పనిచేసిన శామ్యూల్ బెనెడిక్ట్ ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరారు. నంద్యాలకు ప్రాంతానికి చెందిన దేశాయి కప్పూరావు, కోడి నరసింహం, ఆత్మకూరు నాగభూషణం శెట్టి, ఎర్రబోలు సుబ్బారెడ్డి, యాతం మహానందిరెడ్డి, రాజా శ్రీనివాసలు స్వాతంత్ర్య పోరాటంలో స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

కలియుగ దాన కర్ణుడు బుడ్డా వెంగళ రెడ్డి



ఉయ్యాలవాడలో వెంకమ్మ, నల్లపు రెడ్డి దంపతులకు 1822లో బుడ్డావెంగళ రెడ్డి జన్మించారు. ఆపదల్లో ఉన్న వారిని ఆదుకునేందుకు ఎల్లప్పుడూ ముందుండేవారు. 1866లో డొక్కల కరువు వచ్చినప్పుడు గంజి కేంద్రం ఏర్పాటు చేసి పేదల ఆకలి తీర్చారు. తన యావదాస్తి సుమారు వెయ్యి ఎకరాలు ధారపోసి ప్రజల కోసమే జీవించిన దాన కర్ణుడు. ఈయన సేవలకు బ్రిటీష్ రాణి బంగారు పతకం ఇచ్చి సత్కరించింది. 1900 డిసెంబర్ 31న ఈయన స్వర్గస్తులై చరిత్రలో నిలిచిపోయారు.

విద్యా ప్రదాత కసిరెడ్డి వెంకట రెడ్డి



కర్నూలులో కేవీఆర్ కళాశాల వ్యవస్థాపకుడు కసిరెడ్డి వెంకటరెడ్డి. మిద్తూరు మండలం 49 బన్నూరుకు చెందిన ఈయన 1885లో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. చుట్టుపక్కల పిల్లలు ఉన్నత విద్యకు దూరంగా ఉంటున్న విషయాన్ని గమనించారు. కర్నూలు రైల్వే స్టేషన్ సమీపంలోని 14 ఎకరాలను 1956లో విరాళంగా ఇవ్వడంతో 1958 జులై 29న జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. రాయలసీమలో ఏర్పాటైన మొట్టమొదటి బాలికల జూనియర్ కళాశాలగా నిలిచిపోయింది. ప్రస్తుతం అక్కడ డిగ్రీ, పీజీ ఉన్నత విద్యను కూడా అభ్యసిస్తున్నారు.

రావుబహదూర్ రెడ్డి లక్ష్మమ్మ



1878లో పెండేకల్లులో జన్మించిన రెడ్డి లక్ష్మమ్మకు 8వ ఏటనే శివారెడ్డితో వివాహమైంది. రెండేళ్లలోనే భర్త చనిపోయారు. నిరాశతో కుంగిపోక సమాజం కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. 1932లో పత్తికొండలో వసతి గృహం నెలకొల్పి దాతల సహాయంతో పేద పిల్లలకు భోజనం పెట్టారు. అనాథలను వృద్ధిలోకి తెచ్చారు. ఆమె 1982లో మృతి చెందారు. కాగా 2015 వరకు ఎస్సీ బాలుర వసతి గృహం నడిచింది. ప్రస్తుతం ఆ భవనాన్ని ప్రభుత్వ బీసీ కళాశాల హాస్టల్‌గా మార్చారు. రెడ్డి లక్ష్మమ్మ సేవలకు గుర్తుగా ఆంగ్లేయులు బంగారు పతకాన్ని, రావుబహదూర్ బిరుదు ఇచ్చారు. 1932లో గాంధీజీ పత్తికొండను సందర్శించినప్పుడు ఆమె సేవా నిరతిని కొనియాడారు.

గృహ నిర్మాణాలు వెంటనే పూర్తి చేయండి



ఇంటి నిర్మాణాలను పూర్తి చేయలని లబ్ధిదారులకు నోటీసు అందిస్తున్న హౌసింగ్ ఏఈ బాలయ్య

కర్నూలు(రూరల్): మండలంలోని పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులు వెంటనే ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని మండల ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ పి.బాలయ్య సూచించారు. గురువారం మండల పరిధిలోని గార్గేయపురం జగనన్న హౌసింగ్ లే అవుట్‌ను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని బీసీ కాలనీలో జగనన్న కాలనీ లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేయలని సూచించారు. గృహనిర్మాణాలు ఇప్పటి వరకు మొదలు పెట్టని లబ్ధిదారులకు ఇంటి స్థలం రద్దు (లేదా) నిర్మాణం కొరకు ప్రభుత్వం అందజేసిన డబ్బులైనా వెనక్కి ఇవ్వవలసి ఉంటుందన్నారు. మండల పరిధిలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకం కింద 1,050 పక్కా గృహాలు మంజూరు కాగా 630 పూర్తయ్యాయని 420 నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ పవన్ కుమార్, మండల హౌసింగ్ వర్కింగ్ ఇన్‌స్పెక్టర్లు ఇస్మాయిల్, రామేశ్వరమ్మ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



చెత్త సేకరణను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్

కర్నూలు(రూరల్): పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే రోగాల బారిన పడకుండ ఆరోగ్యంగా ఉంటారని కర్నూలు జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ అన్నారు. మండల పరిధిలోని గొందిపర్ల గ్రామంలో గురువారం గ్రామ పారిశుద్ధ్య కార్మికుల చెత్త సేకరణను పరిశీలించారు. అనంతరం ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. తడిచెత్తను, పొడి చెత్తను వెరు చేసి గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులకు అందజేయలన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న స్వామిత్ర సర్వేను పరిశీలించారు. అదేవిధంగా గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కృపవరం, పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దెబ్బతింటున్న ఉల్లి పంట



తడకనపల్లెలో తెగులు సోకిన ఉల్లి పంట

కల్లూరు: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉల్లి పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా 240 హెక్టార్లలో వివిధ గ్రామాల్లో ఉల్లి పంటను రైతులు సాగు చేశారు. తడకనపల్లె గ్రామంలో రైతులు సుమారుగా 70 ఎకరాలు సాగుచేశారు. ప్రస్తుతం పంట 40 నుంచి 60 రోజుల దశలో ఉంది. గత కొన్ని రోజులుగా విడతల వారీగా కురుస్తున్న వర్షాల వల్ల ఉల్లి పంటకు మజ్జిగ తెగులు, ఇతర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. పొలంలో నీరు నిలవడం, నీటి శాతం అధికమవడం వల్ల మజ్జిగ తెగులు వస్తే పంట పూర్తిగా దెబ్బతింటుందని అన్నదాతలు ఆందోళనలో ఉన్నారు.



మొదటి మలుపు వద్ద సైడ్ రైలింగ్ లేని దృశ్యం

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు



రెండవ మలుపు వద్ద దెబ్బతిన్న రైల్లింగ్

పాణ్యం : మండల పరిధిలోని పిన్నాపురం ఘాట్ రోడ్ మలుపులు ప్రమాదాలకు పిలుపుగా మారాయి. ఏ మాత్రం అదమరిచినా అంతే సంగతే.. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రోడ్డు ఘాట్‌ల వద్ద సైడ్ రైలింగ్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి. మలుపులు మినహా ఘాట్‌లో రోడ్డు మొత్తం ఇరుకుగా ఉంటుంది. ఘాట్ రోడ్డులోని మలుపుల వద్ద వాహనాలు దగ్గరకు వచ్చేంత వరకు ఎదురు పడవు. ఈ క్రమంలో రైలింగ్ లేని కారణంగా వాహనాలు వేగంలో రోడ్డు దిగిపోయే ప్రమాదం ఉంది. అంతేకాక సూచిక బోర్డులు కూడా లేవు. అధికారులు చర్యలు తీసుకొని ఘాట్‌లో రైలింగ్, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్లస్టర్ వర్సిటీ ఐక్యూఏసీ కమిటీ ఏర్పాటు

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ఆచార్య వి.వెంకట బసవరావు ఆదేశాల మేరకు వర్సిటీ ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ సలహా కమిటీని ఏర్పాటు చేస్తూ రిజిస్ట్రార్ ఆచార్య కట్టా వెంకటేశ్వర్లు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ చైర్మన్‌గా వీసీ, ఏఓలుగా రిజిస్ట్రార్, పరీక్షల విభాగం డీన్, పరిపాలన విభాగం డీన్, అకడమిక్ విభాగం డీన్, సిల్వర్‌జూబ్లీ, ప్రభుత్వ పురుషుల డిగ్రీ, కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాళ్లను నియమించారు. డైరెక్టర్‌గా కేవీఆర్ కాలేజీ అధ్యాపకులు డాక్టర్ మహబూబ్ బాషా, డిప్యూటీ డైరెక్టర్లుగా సిల్వర్ కాలేజీ అధ్యాపకులు డాక్టర్ జి.ఎల్లా క్రిష్ణ, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ అధ్యాపకులు డాక్టర్ కె.జీ మల్లికార్జున, సభ్యులుగా రాధారమణి (కేవీఆర్ కాలేజీ), బి.మసూదా వలి (ప్రభుత్వ పురుషుల కాలేజీ), సీహెచ్.నాగ సురేష్ (సిల్వర్‌జూబ్లీ కాలేజీ), ధర్మేందర్ (పురుషుల కాలేజీ), ఏబీఎల్ పావని (కేవీఆర్), ఆచార్య ఎస్.మన్సూర్ రెహ్మాన్ (సొసైటి), ఎస్.రాజశేఖర్ (ఫస్ట్ స్టెప్ టెక్నాలజీస్), పి.విజయ (ఏపీ టూరిజం), విజయకుమార్ రెడ్డి (సాయి డెకరేటర్స్), కురువ రమేష్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, ఐఐటీ బాంబే) కమిటీలో ఉన్నారు.

మెగా జాబ్‌మేళా

కల్లూరు: కర్నూలు నగరం డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. జాబ్ మేళాకు అధిక సంఖ్యలో నిరుద్యోగ యువతి, యువకులు హాజరయ్యారు. కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి దీప్తి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇందిరా శాంతి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా రాజు

కోడుమూరు రూరల్: సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులుగా కోడుమూరు సీపీఐ మండల కార్యదర్శి రాజు ఎన్నికయ్యారు. ఈనెల 9, 10 తేదీల్లో కర్నూలులో జరిగిన సీపీఐ 24వ మహాసభల్లో రాజును సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజును గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పూలమాల, దుశ్శాలువాతో సత్కరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీరాములు గౌడ్, రంగస్వామి పాల్గొన్నారు.

రాకపోకల పునరుద్ధరణ



గగ్గటూరు వద్ద ట్రాక్టర్లలో ఊరుముందు వాగును దాటుతున్న ప్రజలు

పాణ్యం : గగ్గటూరు-రాయపాడు గ్రామాల మధ్య గత పది రోజులుగా నిలిచిన పోయిన రాకపోకలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. గగ్గటూరు ముందు ఉన్న వాగుపై ఉన్న బ్రిడ్జి తగ్గులో ఉండడంతో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు బ్రిడ్జిపై 4-5 అడుగుల ఎత్తులో నీరు ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. కొత్తూరు ఆలయానికి వచ్చే భక్తులు బనగానపల్లె, పాణ్యం మీదుగా రాకపోకలు సాగించేవారు. రెండు రోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వాగుకు వరద ఉద్ధృతి తగ్గింది. దీంతో బ్రిడ్జిపై రెండు అడుగుల మేర నీటి ప్రవాహం ఉన్నందున ప్రజలు ట్రాక్టర్లలో వాగులో దాటుతున్నారు. దాదాపు పది రోజుల నుంచి రాకపోకలు లేనందునన ప్రజలు, రైతులు, తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాకపోకలు పునఃప్రారంభం కావడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

2023లో ప్రతిపాదనలు

ఊరు ముందరి వాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం గత ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి రూ. 2.50కోట్లతో ప్రతిపానదలు పంపించగా, వాటికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తర్వాత టెండర్ దశకు చేరుకునే లోపే ఎన్నికల ప్రక్రియ ప్రారంభంకావడంతో పనులు ప్రారంభానికి నోచుకోలేదు.



బురదతో మురుగు కాల్వలను తలపిస్తున్న వీధి

కాలు పెడితే.. జారి పడాల్సిందే..!



నడువలేని విధంగా ఉన్న పాఠశాలకు వెళ్లే రోడ్డు,



వాననీటి నిల్వతో అధ్వానంగా ఉన్న వీధి

కోడుమూరు రూరల్ : మండలంలోని బైన్‌దొడ్డి గ్రామంలో అంతర్గత రోడ్లు, మురుగునీటి కాల్వల్లేక పోవడంతో వాననీరంతా వీధుల్లోనే నిలిచిపోతుంది. నిత్యం వాననీటి నిల్వతో వీధులన్నీ బురదమయంగా మారిపోయాయి. ప్రజలు తమ ఇళ్లలో నుంచి బయటకు రావలన్నా, ఇంట్లోకి వెళ్లాలన్న బురదలోనే నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. బురదమయంగా మారిన దారిలో కాలు పెడితే ఎక్కడ జారిపడతామోనన్న భయంతో ప్రజలు అడుగులో అడుగు వేసుకుంటూ జాగ్రత్తగా వెళ్లాల్సిన పరిస్థితి. ముఖ్యంగా గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారంతా బురదమయంగా ఉండడంతో పాఠశాలకు వెళ్లే క్రమంలో విద్యార్థులు బురదలో జారి పడిపోతున్నారు. దీనివల్ల ఇటు విద్యార్థులతో పాటు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు నిర్మించి తమ ఇబ్బందులను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీసీలకు అండగా నిలుద్దాం

కర్నూలు (టౌన్): పార్టీలో బీసీ వర్గాలకు ఉన్న ప్రత్యేక గుర్తింపును వివరించి బీసీలకు అండగా నిలుద్దామని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ స్పష్టం చేశారు. పులివెందుల ఎన్నికల్లో టీడీపీ గుండాల దాడిలో తీవ్రంగా గాయపడి కోలుకున్న ఆయన్ను వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు రాఘవేంద్రనాయుడు గురువారం ప్రొద్దుటూరులోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడాది పాలనలో ప్రభుత్వ వైఫల్యాల వల్ల ప్రజలు, మహిళలు మళ్లీ వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. పార్టీకి రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకనే తనపై, బీసీలపై దాడులు చేస్తున్నారన్నారు. ఐక్యంగా ఉందాం, రాబోయే రోజులు మనవే అని స్పష్టం చేశారు.

వైద్యారోగ్యశాఖాధికారులు నిర్లక్ష్యం వీడాలి

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కొందరు ఆర్‌ఎంపీలు అర్హత లేని టెక్నీషియన్లు విచ్చలవిడిగా స్కానింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల దృష్టికి రాకపోవడం విడ్డూరమన్నారు. ఎవరైనా మరణించినప్పుడు మాత్రం హడావుడి చర్యలు తప్ప ముందస్తు చర్యలు తీసుకోవడం లేదన్నారు.